MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 327 | ఆదివారం 12 అక్టోబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-







## చరిత్ర సృష్టించిన
# ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్

**ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మిథాలీ రాజ్ స్టాండ్, రావి కల్పనా గేట్ ప్రారంభం**



- ఆవిష్కరించిన ముఖ్యఅతిథి మంత్రి నారా లోకేష్
- హాజరైన ఐసిసి చైర్మన్ జయ్ షా, బిసిసిఐ ప్రెసిడెంట్ మిథున్ మన్‌హాస్, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ బాబు
- మిథాలి కి వెండి క్రికెట్ బంతిని బహుమతిగా అందించిన మంత్రి లోకేష్
- మహిళా క్రికెటర్లను గౌరవించడం అభినందనీయం :ఐటీ మంత్రి నారా లోకేష్



**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి విశాఖపట్నం అక్టోబర్ 12**

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు చరిత్రలో బీసీసీఐలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చరిత్ర సృష్టించింది క్రికెట్ చరిత్రలో మొట్టమొదటిసారిగా మహిళా క్రికెటర్ల పేరుతో క్రికెట్ ప్రేక్షకుల స్టాండ్ లకు మహిళా క్రికెట్ పేర్లు పెట్టడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు - మిగతా2లో














## విశాఖ అభివృద్ధికి పదేళ్ల సమయం చాలు

- హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళ్లు
- ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం
- అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం
- డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

**విశాఖపట్నం**

ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దుతామని, 2047 నాటికి విశాఖ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన అనంతరం రిషికొండలోని ఏ1 - మిగతా3లో

# నకిలీకి చెక్..



- 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్' ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- "నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్' ను డిజైన్ చేశాం
- స్కాన్ చేస్తే చాలు.. ఆ సీసాకు సంబంధించిన వివరాలన్నీ తెలుస్తాయి
- ఎక్కడ అమ్ముతారో అక్కడే జియో ట్యాగింగ్ అవుతుంది.
- ఈ యాప్, యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూస్తాం.
- నకిలీ మద్యం కేసులో ఎలాంటి రాజీ లేదు.. మొత్తం ప్రక్షాళన చేస్తాం.

**ఉండవల్లి:**

రాష్ట్రానికి కల్తీ మద్యం వైకాపా ప్రభుత్వం నుంచి వారసత్వ సంపదగా వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కేసులో షాకింగ్ వార్తలు బయటకు వస్తున్నాయని, దీనిపై ప్రస్తుతం మాట్లాడదలచుకోలేదన్నారు. కల్తీ మద్యంపై విచారణకు జీవీజీ అశోక్‌కుమార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉండవల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో.. నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు రూపొందించిన ' ఏపీ ఎక్సైజ్‌సురక్షా యాప్'ను చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నకిలీ మద్యంపై సిట్ బృందంతో మొత్తం ప్రక్షాళన చేస్తామన్నారు. సిట్‌లో రాహుల్‌దేవ్ శర్మ, కె.చక్రవర్తి, మలికా గార్గ్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. "నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్' ను డిజైన్ చేశాం. స్కాన్ చేస్తే చాలు.. ఆ సీసాకు సంబంధించిన వివరాలన్నీ తెలుస్తాయి. ఎక్కడ అమ్ముతారో అక్కడే జియో ట్యాగింగ్ - మిగతా3లో



## ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!

ఈజిప్ట్ వేదికగా ఇజ్రాయెల్ గాజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది.
మరోవైపు.. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం.



## సైనిక స్థావరాలపై తాలిబన్‌ల దాడి

58 మంది పాక్ సైనికులు మృతి

పాక్ సేనలు అఫ్గాన్ రాజధాని కాబూల్‌పై దాడికి పాల్పడగా.. ప్రతీకారంగా తాలిబన్ సైన్యం పాక్ సైనిక స్థావరాలపై దాడులు



## ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!

భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..

లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరి

మిగతా వారికి చెరో ఆరు చొప్పున సీట్లు

# నకిలీ మద్యం కేసులో బిగ్ ట్విస్ట్..



- జనార్థన్ ఫోన్ ఎక్కడ?
- నకిలీ మద్యం కేసులో టీడీపీ గ్యాంగ్.. సాక్ష్యాలను దాచే ప్రయత్నం
- ఆఫ్రికా నుంచి వస్తుండగా తన ఫోన్ ముంబై ఎయిర్‌పోర్టులో పోయిందని జనార్థన్ చెప్పుకొచ్చారు
- ఈ నేపథ్యంలో జనార్థన్ పేరుతో మరో సిమ్ తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖ ప్రయత్నాలు చేస్తోంది.
- టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ సిండికేట్ ద్వారా సాగిస్తున్న మద్యం దోపిడీ బహిరంగ రహస్యమే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల విధానాన్ని తొలగించి మొత్తం 3,396 మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్‌కు కట్టబెట్టింది

**అమరావతి**

ఏపీలో నకిలీ మద్యం కేసులో ట్విస్ట్‌ల మీద ట్విస్టులు చోటుచేసుకుంటున్నాయి. నకిలీ మద్యం కేసులో టీడీపీ గ్యాంగ్.. సాక్ష్యాలను దాచే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఈ కేసులో ప్రధాని నిందితుడు, టీడీపీ నాయకుడు జనార్థన్ రావు ఫోన్ మిస్సింగ్ అని కొత్త కోణాన్ని తెర మీదకు తెచ్చారు. ఈ నేపథ్యంలో కీలక ఆధారాలను దాచే ప్రయత్నం జరుగుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, నకిలీ మద్యం కేసులో టీడీపీ నాయకుడు జనార్థన్ రావును అరెస్ట్ చేసిన తర్వాత ఆయన ఫోన్ గురించి పోలీసులు ఆరా తీశారు. అయితే, ఆఫ్రికా నుంచి వస్తుండగా తన ఫోన్ ముంబై ఎయిర్‌పోర్టులో పోయిందని జనార్థన్ చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో జనార్థన్ పేరుతో మరో సిమ్ తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. జనార్థన్ ఫోన్ కాల్ డేటాను కనుక్కోవడానికి అధికారుల ప్లాన్ చేస్తున్నారు. ఇక, జనార్థన్ రావు ఫోన్ దొరికితే మరికొందరు టీడీపీ నాయకులు బయటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన ఫోన్‌లో ఆర్థిక లావాదేవీల వివరాలు కూడా - మిగతా3లో

# చరిత్ర సృష్టించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్

-మొదటిపేజీ తరువాయి

కేశినేని శివనాథ్ రాష్ట్ర కార్యదర్శి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో విశాఖపట్నం స్టేడియంలో మహిళా క్రికెట్ పేర్లతో రెండు స్టాండ్స్ ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మహిళా క్రికెటర్లు ప్రోత్సహించడం ద్వారా మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వాలని మహిళా క్రికెటర్ల పేరుతో క్రికెట్ స్టేడియం లో స్టాండ్స్ ఏర్పాటు చేయడం రాబోవు ఉత్తరంలో మహిళా క్రికెటర్లకు స్ఫూర్తినిస్తుందని మంత్రి నారా లోకేష్ అన్నారు మహిళా క్రికెటర్ల పేరుతో స్టాండ్స్ ని ఏర్పాటు చేయడం పట్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అభినందిస్తున్నానని ఇది ఒక మంచి ప్రయత్నమని భవిష్యత్తులో మహిళా క్రికెట్ ను మరింతగా ప్రోత్సహించాలని నారా లోకేష్ సూచించారు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏసీఏఆదివారం మహిళల క్రికెట్‌లో అత్యున్నత విజయాలు సాధించిన మహిళ క్రికెటర్లు మిథాలీ రాజ్ రావి కల్పనలకు ఘనంగా గౌరవించింది.. విశాఖపట్నంలోని ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఎ గ్యాలరీ స్టాండ్ కు మిథాలీ రాజ్ పేరు, మూడో గేట్ కు రావి కల్పన పేరుతో ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు.. ఈ కార్యక్రమానికి ఐసీసీచైర్మన్ జయ్ షా, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, క్రికెట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఈ వేడుకకు ఐసీసీ సి.ఈ.వో సంజోగ్ గుప్తా, క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ మైక్ బైర్డ్ , ఆస్ట్రేలియా సీఈవో టాడ్ గ్రీన్‌బర్గ్ కూడా హాజరయ్యారు. బిసిసిఐ అధ్యక్షుడు మిథున్ మన్‌హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, సంయుక్త కార్యదర్శి ప్రభ్‌తేజ్ భాటియా కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏసీఏతరపున కార్యదర్శి సానా సతీష్ బాబు, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బి విజయ్ కుమార్ లతో పాటు కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణుతేజ్ మాజీ కార్యదర్శి చాముండేశ్వరి నాథ్ హాజరయ్యారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పరిధిలోని అన్ని జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు అనుబంధ సంస్థ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు

మంత్రి నారా లోకేశ్ మిథాలీకి ఏసీఏ లోగోతో కూడిన లిమిటెడ్ ఎడిషన్ హ్యాండ్‌క్రాఫ్ట్ చేసిన వెండి క్రికెట్ బంతిని



బహుమతిగా అందించారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ: "మిథాలీ రాజ్ అనేది కేవలం పేరు కాదు %–% ఒక బ్రాండ్. ఆమె అద్భుతమైన క్రికెటర్ మాత్రమే కాదు, దేశంలోని లక్షలాది యువతులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. %ూజాూ–ఎణజాూ% స్టేడియంలో ఆమె పేరు మీద స్టాండ్ ఉండటం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రం నుండి వందలాది మిథాలీలు రాలాలని, దేశానికి సేవ చేయాలంటూ ఆకాంక్షించారు.

ఐసీసీచైర్మన్ జయ్ షా మాట్లాడుతూ మిథాలీ రాజ్ ఇండియాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ను ప్రభావితం చేసింది. ఎంతో మంది మహిళ క్రికెటర్లకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ స్టేడియంలో ఎ గ్యాలరీకి ఆమె పేరు పెట్టడంతో సరైన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు . ఈ ప్రోత్సాహంతో...మహిళలు క్రికెట్‌ను ఎంచుకుని రాబోయే తరం క్రికెటర్లుగా ఎదగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్అధ్యక్షుడు కేసినేని శివనాథ్ మాట్లాడుతూ కార్యదర్శి సానా సతీష్ బాబు మాట్లాడుతూ వుమెన్స్ క్రికెట్ లో లెజెండ్ మిథాలీ రాజ్ ను గౌరవించటం ఏసీఏ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆమె పేరు మీద స్టాండ్ ఏర్పాటు చేయడం ఏ సి ఏకి గర్వకారణంగా పేర్కొన్నారు.

అనంతరం మిథాలీ రాజ్ స్పందిస్తూ వైజాగ్ లో తన పేరు మీద స్టాండ్ ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపు ఇచ్చినందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, ఏసీ ఏకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నగరం నా ఎదుగుదలకి కేంద్ర బిందువుగా నిలిచింది. మహిళల క్రికెట్ ఎంత అభివృద్ధి చెందిందో చూసి ఎంతో ఆనందంగా ఉందన్నారు

రావి కల్పనా మాట్లాడుతూ ఇదంతా తనకి ఒక కలలా అనిపిస్తుందన్నారు. తన కెప్టెన్ మిథాలీ దీదీతో కలిసి గౌరవం పొందుతానని కలలో కూడా ఊహించలేదన్నారు. మంత్రి నారా లోకేష్, ఏసీఏ కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి చెందిన మహిళా క్రికెట్ క్రీడాకారులు రాబోయే రోజుల్లో దేశానికి పేరు తెస్తారన్న నమ్మకం ఉందన్నారు.

# విశాఖ అభివృద్ధికి పదేళ్ల సమయం చాలు

-మొదటిపేజీ తరువాయి

గ్రాండ్ కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఇక్కడున్న ఐటీ ప్రొఫెషనల్స్ కు, సీఈవోలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నిజాయతీగా చెప్పాలంటే.. 1990ల్లో లో పలు ఐటీ సంస్థలు హైదరాబాద్ కు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైబర్ టవర్స్ ను నిర్మించారు. దీనివల్ల అనేక సంస్థలు హైదరాబాద్ కు వచ్చాయి. హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళు పైనే పట్టింది. విశాఖకు పదేళ్లకు మించి పట్టదు. అది మా కమిట్ మెంట్. కంపెనీలు తీసుకురావడం వెనుక ఉన్న శ్రమను ప్రజలు గుర్తించాలి. రాజు గారిని మొదటిసారిగా 2017లో కాలిఫోర్నియాలో కలిశాను. ఆ సమయంలోనే మొదలైంది ఈ ప్రయాణం. ఆయనను విశాఖ, ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చేందుకు నాకు 8 ఏళ్ల సమయం పట్టింది. పెట్టుబడుల కోసం ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతోనే కాదు.. ఇతర దేశాలతో పోటీపడుతున్నాం. ఈ కష్టాన్ని ప్రజలు కూడా అర్థం చేసుకున్నారు. ఈ పెట్టుబడులు ఒక్కరోజులో రాలేదు. మంతెన రామరాజు, ఎన్ఆర్ఐ టీడీపీ నేత సాగర్ దొడ్డపనేని, కాటంనేని భాస్కర్ ఈ ప్రాజెక్ట్ ను విశాఖపట్నానికి తీసుకురావడంలో ఎంతో కీలకపాత్ర పోషించారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఎంతో మంది కృషి ఉంది. గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. విశాఖపట్నం ఏపీకి ఆర్థిక రాజధాని. ఇది మా అజెండా. ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ప్రజలు ఆ విధంగానే ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. 94 శాతం సీట్లతో విజయం సాధించాం. సమర్థ పాలనకు, ఉద్యోగాల సృష్టికి, విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడానికి ప్రజలు స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. ఈ నగరంపై నాకు ప్రత్యేకమైన ప్రేమ ఉంది. 2019లో రాష్ట్రంలో, ఇతర ప్రాంతాల్లో మేం ఓడిపోయినా విశాఖ ప్రజలు మాత్రం మాతోనే ఉన్నారు. విశాఖ ప్రజలు ధైర్యవంతులు. 2014 సమయంలో హుద్ హుద్ విపత్తు వచ్చినప్పుడు నగరం తీవ్రంగా నష్టపోయింది.



అప్పుడు విశాఖ ప్రజలు నగర పునరుద్ధరణకు చంద్రబాబునాయుడు ఎంతో మద్దతుగా నిలిచారు. ఆ సమయంలో ప్రధాని మోదీ గారు కూడా నష్టాన్ని స్వయంగా చూశారు. ఇంత విధ్వంసం తర్వాత కూడా ప్రజలు చిరునవ్వుతో చేతులు ఊపుతూ స్వాగతం పలికారు. అది విశాఖ ప్రజల స్ఫూర్తి.

గత 17 నెలల్లో ఏపీకి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతం కంటే ఎక్కువగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ కు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ విశాఖకు వస్తోంది. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖపట్నానికే వస్తోంది. దీనివల్ల శక్తివంతమైన ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. సూపర్ సిక్స్ హామీల్లో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తాం. విశాఖలో 3 లక్షల మంది యోగాంధ్ర నిర్వహించి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ సృష్టించాం. ఇది చూసి ప్రధాని గారు ఆశ్చర్యపోయారు. ఇదీ విశాఖ ప్రజల నిబద్ధత. ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోగలిగాం. కేంద్రం స్టీల్ ప్లాంట్ కు రూ.11వేల కోట్ల సాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లు అందించింది. మూడు ఫర్నేస్ లు ఇప్పుడు పనిచేస్తున్నాయి. వంద శాతం సామర్థ్యంతో నడిపి ప్లాంట్ ను లాభదాయకంగా మారేలా చేస్తాం. నిధులు అడగాల్సిన అవసరం రాకూడదు. ఇదే మా లక్ష్యం. రూ.14వేల కోట్ల సాయం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించడమే కాదు.. అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం. ఇది కేవలం ఏపీ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాదు.. భారత్ ఆర్థిక వ్యవస్థకూ దోహదం చేస్తుంది. రైల్వే జోన్ సాధించాం, స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నాం. ఇప్పుడు టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి ఐటీ కంపెనీలు వస్తున్నాయి. వచ్చే మూడు నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఏ ఒక్క పెట్టుబడి పొరుగు రాష్ట్రాలకు వెళ్లకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఇది తొలి అడుగు మాత్రమే. మొత్తం ఎకో సిస్టమ్ రావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్న, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ హర్షా రామ్, రాజేష్ తిరుమల రాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఐటీ కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, ఇతర ఉన్నతాధికారులు ఎన్.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాధా ఫ్రెండ్ షిప్...

## బూమ్ రాంగ్ అవుతుందా

**విజయవాడ :** ఉమ్మడి ఏపీలో వంగవీటి కుటుంబానికి ఘనమైన చరిత్ర. వంగవీటి మోహన్ రంగా ఒక చరిత్ర సృష్టించారు. ప్రజా సంఘాల నాయకుడిగా విజయవాడలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అయ్యింది ఒక్కసారి మాత్రమే అయినా.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయ్యారు. కాపు సామాజిక వర్గానికి అండగా నిలిచారు. అందుకే ఆయన చనిపోయి మూడున్నర దశాబ్దాలు అయినా ఆయన మాత్రం తెలుగు రాజకీయాల్లో సజీవంగా ఉన్నారు. అయితే ఆయన పేరుతో రాజకీయ పార్టీలు లబ్ధి పొందుతున్నాయి తప్ప.. ఆయన వారసుడు వంగవీటి రాధాకృష్ణ మాత్రం లాభపడింది తక్కువ. దానికి ఆయన స్వయంకృతాపరాధం ఉంది. మనం తీసుకునే నిర్ణయాలు.. అనుసరించే వ్యూహం బట్టి రాజకీయాల్లో రాణింపు ఉంటుంది. ఈ విషయంలో మాత్రం ఆయన తొందరపాటు చర్యలే ఆయనకు ఈ పరిస్థితికి తెచ్చిపెట్టాయి. 2004లో విద్యార్థి దశలో ఉన్నారు వంగవీటి రాధాకృష్ణ. ఆ సమయంలో పాదయాత్ర చేశారు రాజశేఖర్ రెడ్డి. వంగవీటి మోహన్ రంగ కుమారుడిగా గుర్తించి రాధాకృష్ణను ప్రోత్సహించారు. ఏకంగా అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన రాధాకృష్ణ 3 పదుల వయసు లోనే అసెంబ్లీలో అడుగుపెట్టారు. అందరి దృష్టిని ఆకర్షించగలిగారు. అయితే 2009లో ఆయన చేసిన తప్పిదం శాపంగా మారింది. ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లిపోయారు రాధాకృష్ణ. రాజశేఖర్ రెడ్డి వద్దని వారించినా వినలేదు. ప్రజారాజ్యం పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అదే ఎన్నికల్లో రెండోసారి కాంగ్రెస్ తరపున గెలిచి ఉంటే తప్పకుండా వంగవీటి రాధాకృష్ణ మంత్రి అయ్యేవారు. ఏపీ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదిగేవారుఅయితే అదే ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్లో విలీనం అయిన వేళ చాలా బాధపడ్డారు రాధాకృష్ణ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ తరఫున 2014 ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ ఓడిపోయారు. వైసీపీ సైతం అధికారంలోకి రాలేదు. కనీసం రాధాకృష్ణకు గుర్తింపు దక్కలేదు. 2019 ఎన్నికల్లో వైసీపీ టికెట్ లభించలేదు. దీంతో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు రాధాకృష్ణ. అది మొదలు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చారు. oooo

## నకిలీకి చెక్..

-మొదటిపేజీ తరువాయి

అవుతుంది. మరోచోట అమ్మేందుకు వీల్లేదు. అలా చేస్తే నేరం కూడా. స్కాన్ చేశాక తయారీ కేంద్రం, తేదీ, బ్యాచ్ అన్నీ వివరాలు తెలుస్తాయి. ప్రస్తుతం గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్, యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూస్తాం. నకిలీ మద్యం కేసులో ఎలాంటి రాజీ లేదు.. మొత్తం ప్రక్షాళన చేస్తాం. బెల్ట్ షాపుల్లో అమ్మేవారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. గంజాయి, మరో వైపు కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని గత పాలకులు చిన్నాభిన్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యాన్ని చట్టబద్ధం చేసి మరీ నేర సామ్రాజ్యం సృష్టించారని మండిపడ్డారు. కల్తీ మద్యం నివారణకు సిట్, గంజాయ్ నివారణకు ఈగల్ బృందాలు ఏర్పాటు చేసి కట్టడి చేశామని సీఎం వెల్లడించారు. ఇంత చేస్తున్నా కొందరు బరితెగిస్తే చూస్తూ ఊరుకుంటామా అని హెచ్చరించారు. నేరస్థులు ఏ ముసుగులో వచ్చినా కట్టడి చేసి తీరుతామని తేల్చిచెప్పారు. ఎంతటి వారైనా, ఎవరైనా ఉపేక్షించేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో తప్పులు చేస్తే ఉపేక్షించే సమస్యే లేదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు.

## నకిలీ మద్యం కేసులో బిగ్ ట్విస్ట్..

-మొదటిపేజీ తరువాయి

ఉండే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. కానీ, ముంబై ఎయిర్‌పోర్టులో ఫోన్ పోయిందనే ఆయన వ్యాఖ్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**టీడీపీ సిండికేట్.. :** ఇదిలా ఉండగా.. 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ సిండికేట్ ద్వారా సాగిస్తున్న మద్యం దోపిడీ బహిరంగ రహస్యమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల విధానాన్ని తొలగించి మొత్తం 3,396 మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్‌కు కట్టబెట్టింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతులిచ్చింది. 75 వేల బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసినా ఉదాసీనంగా ఉంటోంది. 540 బార్లను (త్వరలో మరో 300 బార్లు కూడా) టీడీపీ సిండికేట్‌కు కట్టబెట్టింది. ఇలా రాష్ట్రంలో మద్యం నెట్‌వర్క్‌ను టీడీపీ సిండికేట్ గుప్పిటపట్టింది. అనంతరం జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు, జనార్దన్‌రావు ఆధ్వర్యంలో ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం యూనిట్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసింది. టీడీపీ సీనియర్ నేతలకు ప్రాంతాలవారీగా పంపిణీ బాధ్యతలు అప్పగించింది. నకిలీ మద్యాన్ని ప్రభుత్వ లైసెన్స్ పొందిన ప్రైవేటు మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్ట్ షాపుల్లో దర్జాగా విక్రయిస్తూ భారీ దోపిడీకి తెగబడుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తొలి ఏడాదిలోనే రూ.5,280కోట్లు కొల్లగొట్టిన ఈ మద్యం మాఫియా వచ్చే నాలుగేళ్లలో మరో రూ.40 వేల కోట్లు కొల్లగొట్టేందుకు సిద్ధపడింది. అందులో 30 శాతం వాటా కరకట్ట బంగ్లాకే ముడుపులుగా చెల్లించాలన్నది డీల్.

## జగన్ పోరాటంపై

## ప్రజా స్పందన ఎలా ఉందో?

**విశాఖపట్టణం :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి నర్సీపట్నంలో చేసిన పర్యటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదు అని వ్యతిరేకత వ్యక్తం చేయడం, దీర్ఘకాలిక ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చడం ప్రధానాంశంగా నిలిచింది. అయితే, ఈ పర్యటన నిజంగా రాజకీయంగా ఎంత ప్రభావం చూపిందో అంచనా వేయడం కష్టం.జగన్ పర్యటనలకు తరచుగా పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తారు, కానీ జనమద్దతు నిజానికి ఎంతవరకు ఉందో చెప్పడం అసాధ్యం. గత 15 ఏళ్లుగా ఆయన పర్యటనలకు జన సమూహం వస్తూ ఉంటే, ఆ మద్దతు రాజకీయంగా ఎంత ప్రభావం చూపిందో స్పష్టంగా అర్థం కావడం లేదు. నర్సీపట్నం పర్యటనలో కూడా పెద్ద జనసమూహం ఉత్సాహంతో వచ్చింది. అదే సమయంలో, వ్యతిరేక వర్గాలు కూడా ప్రతిఘటన చూపించాయి. ముఖ్యంగా డాక్టర్ సుధాకర్ మరణం నేపథ్యంలో కొన్ని దళిత సంఘాలు జగన్ పర్యటనను వ్యతిరేకించాయి.ఈ పరిస్థితులు ప్రజల పై జగన్ ప్రభావం అంచనా వేయడం కష్టతరం చేస్తాయి. ప్రజల హైప్ ఉన్నప్పటికీ, వాస్తవ మద్దతు ఎంత ఉందో స్పష్టంగా చెప్పలేమని అనిపిస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ పర్యటన విజయవంతమని, ప్రజల మధ్య సానుకూల ప్రభావం చూపించిందని చెప్పడం జరుగుతోంది. అయినప్పటికీ, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో పర్యటన సక్సెస్ అయినా, రాజకీయ ఫలితాలు పరిమితమే అన్న టాక్ నడుస్తుంది.ఇంకా, ఈ పర్యటనలో మొదటిసారి వ్యతిరేకతల స్పష్టత గమనించదగ్గది. గతంలో జగన్ పర్యటనలు సులభంగా, ఎటువంటి వ్యతిరేకత లేకుండా సాగాయి, కానీ ఇప్పుడు వివిధ వర్గాల నిరసనలు పర్యటనల్లోకి ప్రవేశించాయి. ఐదేళ్ల పాలనలో ఎదురైన లోపాలు, ప్రజల ఆగ్రహం ఈ పర్యటనల్లో ప్రత్యక్షంగా దర్శనమిచ్చాయి.జగన్ మోహన్ రెడ్డి ఈ పర్యటన ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, వ్యతిరేకత, మద్దతు మిశ్రమంగా ఉండడం వలన, రాజకీయంగా సాధించిన ఫలితాన్ని అంచనా వేయడం కష్టతరం. నర్సీపట్నం పర్యటన, పార్టీ కోసం ఒక కొత్త పరీక్షగా, రాజకీయ సన్నివేశంలో ప్రత్యేక సందర్భంగా నిలిచింది. మొత్తానికి, జగన్ పర్యటనలో ప్రజల మద్దతు ,వ్యతిరేకత, పార్టీ హైప్ రాజకీయ సవాళ్ల సమ్మేళనం ఒక ప్రత్యేక రాజకీయ పరిస్థితిని సృష్టించింది. నవంబర్ 25 వరకు సాగే ఈ ఉద్యమం "కోటి సంతకాల ప్రజా పోరాటం" గా నిర్వహించనున్నారు.ఉద్యమం మొదటి దశలో గ్రామస్థాయిలో సంతకాల సేకరణ జరుగుతుంది. నవంబర్ 22 వరకు ప్రతి గ్రామంలో ప్రజలు పాల్గొని తమ సంతకాలను ఇవ్వనున్నారు. నవంబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు. నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో కూడా ప్రజా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించింది.తరువాత దశలో, నవంబర్ 23న సేకరించిన సంతకాల పత్రాలను నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు తరలిస్తారు. నవంబర్ 24న లారీలలో వాటిని తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చి ప్రజల సమక్షంలో ప్రదర్శిస్తారు. చివరిగా నవంబర్ 25న ఆ కోటి సంతకాల పత్రాలను గవర్నర్‌కు సమర్పించనున్నారు.ఈ ఉద్యమం ద్వారా ప్రజల అభిప్రాయం స్పష్టంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే జగన్ ఉద్దేశ్యంతో ఉన్నారు. ప్రజా ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఇవ్వడం సరైంది కాదని, ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. మెడికల్ విద్య మరియు వైద్య సేవలు ప్రభుత్వ బాధ్యతగా కొనసాగాలని, ప్రజలు కూడా దీనిపై స్పష్టమైన సందేశం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయంగా కూడా ఈ ఉద్యమం జగన్ మోహన్ రెడ్డికి ఒక పరీక్షగా మారింది. ప్రజల మద్దతు ఎంతవరకు లభిస్తుందో, ప్రభుత్వం ఈ ఒత్తిడికి ఎలా స్పందిస్తుందో అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

## కమలంలో వినిపించని సౌండ్

-మొదటిపేజీ తరువాయి

అధికార ప్రతినిధులైనా మాట్లాడాలి కదా..? వాళ్ళెందుకు రియాక్ట్ అవడం లేదు? అలా ఎందుకు జరుగుతోందని ఆరా తీస్తే? అంతా అధ్యక్షులవారి మహిమ అన్న సమాధానం వస్తోందట. మేం కూడా మా అధ్యక్షుడిని ఫాలో అయిపోతున్నాంలే.ఆయనగారికి లేని దురద మాకెందుకంటూ సన్నిహితుల దగ్గర అంటున్నట్టు సమాచారం. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవే ఏ విషయంలోనూ ఓపెన్‌గా మాట్లాడ్డం లేదు? ఇక మేమేం నోరు తెరుస్తామని అంటున్నట్టు సమాచారం. మాధవ్ ఎప్పటికప్పుడు సిద్ధాంతాల గురించి చెప్పడమే తప్ప?క్షేత్ర స్థాయిలో రాజకీయ కార్యాచరణపై దృష్టి పెట్టడం లేదన్న అసంతృప్తి ఉందట ఏపీ బీజేపీ వర్గాల్లో. ఆయన జిల్లాల పర్యటనల్లో కూడా సిద్ధాంత పరమైన చర్చలే తప్ప? రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం, రాజకీయంగా ఉనికి చాటుకోవడం లాంటి అంశాల మీద దృష్టి సారించడం లేదని చెప్పుకుంటున్నారు. ఇటీవల కూటమి కార్యక్రమాల్లో సైతం ఆయన ఫాలోయర్‌లా కనిపిస్తున్నారే తప్ప? రాష్ట్ర అధ్యక్షుడిగా బీజేపీ వాయిస్ వినిపించడంలో వెనకబడుతున్నారన్న అభిప్రాయం బలపడుతోందట.ఆయన ఎందుకు అలా ఉంటున్నారో తెలీక పార్టీ మిగతా నేతలు సతమతం అవుతున్నట్టు సమాచారం. కేంద్రం ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తేనో, పథకం ప్రారంభిస్తేనో తప్ప? రాష్ట్ర పార్టీకంటూ ప్రత్యేక కార్యాచరణ లేకుండా పోయిందని, అదే పెద్ద మైనస్ అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది కేడర్‌లో. రాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారో, అధికార కూటమి భాగస్వామిగా తామేం చేయాలో కూడా క్లారిటీ లేకుండా పోయిందని, ఇదంతా అధ్యక్షుడి ఉదాసీనత వల్లేనన్న చర్చ జరుగుతోందట కమలం వర్గాల్లో. ఏపీ బీజేపీ అధ్యక్షుడు స్పీడు పెంచకపోతే క్షేత్రస్థాయి బలోపేతం కావడం సంగతి తర్వాత? ఉన్న అరకొర బలం కూడా తుడిచిపెట్టుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కార్యకర్తలు.

# అనంతలో 13న కలెక్టరేట్ లో
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- : జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అంకుశం న్యూస్ అనంతపురం, అక్టోబర్ 12 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో ఈనెల 13వ తారీకున అనంతపురం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారుమీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.లి

- అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



**ఈనెల 13వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ :**

- ఈనెల 13వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మంత్రి లోకేష్,ఐసీసీ చైర్మన్ జైషా లకు స్వాగతం పలికిన
## ఏసీఏ ప్రెసిడెంట్ ఎంపి కేశినేని శివనాథ్ సానా సతీష్ బాబు







**అంకుశం ప్రతినిధి విశాఖపట్నం అక్టోబర్ 12:** మహిళా వరల్డ్ కప్ మ్యాచుల్లో భాగంగా ఆదివారం వైజాగ్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ సందర్భంగా గ్రౌండ్ లో మిథాలీ రాజ్ పేరు, రావి కల్పన పేరుతో ఏర్పాటు చేసిన గ్యాలరీ, గేట్ లను ఆవిష్కరించేందుకు విచ్చేసిన విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, ఐసీసీ చైర్మన్ జైషా లకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) విమానాశ్రయంలో సానా సతీష్ బాబుపుష్పగుచ్చం అందించి ఘనస్వాగతం పలికారు. ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం స్టేడియంలో చేపట్టిన అభివృద్ధి పనులు గురించి మంత్రి నారా లోకేష్, ఐసీసీ చైర్మన్ జైషా లకు ఎంపీ కేశినేని శివనాథ్ , సెక్రటరీ సానా సతీష్ బాబు వివరించారు. . అనంతరం స్టేడియంలో ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ మ్యాచ్ ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో దండమూడి శ్రీనివాస్ , ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, సంయుక్త కార్యదర్శి బి విజయ్ కుమార్ , కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణుతేజ్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ ప్రతినిధి వి. చాముండేశ్వర నాథ్ పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన కు 7,300 మంది పోలీసులతో పకడ్బందీ భద్రత

- కట్టుదిట్టమైన భద్రత
- భద్రతా ఏర్పాట్ల పై బందోబస్తు నిమిత్తం విచ్చేసిన సెక్టార్ పోలీసు ఉన్నతాధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసిన...
- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్





**అంకుశం ప్రతినిధి కర్నూల్ అక్టోబర్ 12:** నంద్యాల జిల్లా శ్రీశైలంలో ప్రధాని నరేంద్ర మోడీఈ నెల 16 వ తేదీన కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టార్ , లైజనింగ్ పోలీసు అధికారులతో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఈ సంధర్భంగా ఆదివారం కర్నూలు , ఓర్వకల్లు మండలం , నన్నూరు దగ్గర ఉన్న రాగమయూరి గ్రీన్ హిల్స్ లో బహిరంగ సభ ప్రాంతం దగ్గర ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి , జియో గ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ మాట్లాడారు. ప్రధాని పర్యటన నిమిత్తం 7,300 పోలీసు బలగాలను బందోబస్తు కు వినియోగిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. నియోజక వర్గాల నుండి వచ్చే వాహనాలను ఏవిధంగా పార్కింగ్ ప్రదేశాలకు మళ్ళింపు చేయాలనే విషయాల పై చర్చించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజక వర్గాల వారిగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలలో వారి వాహనాలను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో ఇండికేషన్ సైన్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆఫీసియల్స్ కి నెంబర్ 2 పార్కింగ్ ఏరియా ను కేటాయించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ డైవర్షన్స్ గురించి, విఐపి కాన్వాయ్ రూట్ , ఏయే నియోజక వర్గాల నుండి ఎంత మంది ప్రజలు వస్తున్నారని, క్రౌడ్ కంట్రోల్ ఏవిధంగా చేయాలనే విషయాల గురించి బందోబస్తు వివరాల గురించి, జియోగ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు . ప్రతి సెక్టార్ ఇంచార్జ్ పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. వివిఐపిల పార్కింగ్, వివి ఐపిల గ్యాలరీల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఎస్పీలు పరమేశ్వర్ రెడ్డి, దేవరాజ్, మాధవ్ రెడ్డి, దీపికా పాటిల్ , జి. కృష్ణకాంత్ , కృష్ణకాంత్ పటేల్,శ్రీనివాసరావు, మణికంఠచందవోలు, దీరజ్ కునుబిల్లి, షెల్కే నచికేత్ విశ్వనాథ్ , చక్రవర్తి, లక్ష్మీనారాయణ, ట్రైనీ ఐపియస్ లు , అడిషనల్ ఎస్పీలు , డిఎస్పీలు , సిఐలు, ఆర్ ఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల పంచాయతీ
# కార్యదర్శుల నిరీక్షణకు తెర దించింది

- ఇది గ్రామాభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వం.. ఎమ్మెల్యే పరిటాల సునీత
- ఎమ్మెల్యే సునీత సమక్షంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం





**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 12:** 20 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తాజాగా క్యాబినెట్ నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తూ రాప్తాడు నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. అక్కడ ఎమ్మెల్యే సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంపై పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లుగా తాము పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నామని.. తమకు ఇప్పటికైనా న్యాయం జరగబోతోందని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాభివృద్ధి కోసం పని చేస్తోందని అన్నారు. తాజాగా క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి 13వేల 351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా మార్చే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. గతంలో పంచాయతీలను 7వేల 244 క్లస్టర్లుగా గుర్తించారని.. ఇకనుంచి ప్రతి పంచాయతీ స్వతంత్ర పంచాయతీగా కొనసాగనుందన్నారు. ఇప్పటికే పంచాయతీల పునర్విభజన కోసం నియమించిన కమిటీ 13వేల 351 పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించిందని.. రూర్బన్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా గుర్తిస్తారన్నారు. అధిక జనాభా, ఆదాయం కలిగిన 359 గ్రామ పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించి, వాటికి అధికారులుగా గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి నియమిస్తారన్నారు. ఇకనుంచి పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీఓ) గా పిలవనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంస్కరణలు చేస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఒక్కరు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల పక్షాన ప్రభుత్వం ఎప్పుడు ఉంటుందన్నారు. అదే సమయంలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధిలైట్లు వంటి వాటి మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో గ్రామాల్లో మరింత అభివృద్ధి చూస్తారని ఎమ్మెల్యే సునీత అన్నారు....

## ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ





**.పోరుమామిళ్ల /కడప, అక్టోబర్ 12(అంకుశం పత్రిక):** జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ను ఎమ్ఎల్సీ గోవిందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తో బాటు బద్వేలు నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, కాశినాయన మండల కన్వీనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట, కోడిపందాల
## స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు..

- 9 మంది జూదరులు అరెస్టు..రూ1,77,500 నగదు .9,సెల్ ఫోన్లు స్వాధీనం.



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 12:** ధర్మవరం డి.ఎస్.పి హేమంత్ కుమార్ పర్యవేక్షణలో పట్టణంలోని వై జంక్షన్ సమీపంలో, బాల్ రెడ్డి వైన్ షాప్ పక్కన ఉన్న బిల్డింగ్ పైన పేకాట ఆడుతున్నారన్న రాబడిన సమాచారం మేరకు ధర్మవరం వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ తమ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 9 మంది పేకాటరాయలను అరెస్టు చేయడంతో పాటు రూ 1,77,800 నగదును , 9 సెల్ ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందని, అనంతరం కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

## అక్టోబర్ 25న పెద్ద శేష
## వాహనంపై మలయప్ప స్వామి దర్శనం

**అంకుశం న్యూస్ తిరుమల అక్టోబర్ 12:** తిరుమలలో అక్టోబర్ 25వ తేదీన నాగుల చవితి పర్వదినం సందర్భంగా పెద్దశేష వాహనంపై రాత్రి 7 నుండి 9 గంటలవరకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయ దేవేరులతో కలిసి దర్శనమివ్వనున్నారు. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా స్వామివారికి విశేష సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి సహస్రనామాలతో శేషసాయి, శేషస్తుత్యం, శేషాద్రి నిలయం అంటూ నిత్య పూజలు అందుకుంటున్నారు. అటు రామావతారంలో లక్ష్మణుడిగా, కృష్ణావతారంలో బలరామునిగా స్వామివారికి అత్యంత సన్నిహితునిగా వ్యవహరించే ఆదిశేషువు శ్రీ వైకుంఠంలోని నిత్యసూరులలో ఆద్యుడు. ఈ విధంగా స్వామివారు, దాసభక్తికి మారురూపంగా నిలిచే తన ప్రియ భక్తుడైన శ్రీ ఆదిశేషుడిపై ఉభయదేవేరులతో కూడి తిరువీధులలో విహరిస్తూ భక్తులకు అభయమివ్వడమే కాకుండా శరణాగతి ప్రపత్తిని కూడా సాక్షాత్కరింపచేస్తాడు.

అందుకే బ్రహ్మోత్సవ వాహన సేవలలో కూడా తొలి ప్రాధాన్యత ఆదిశేషునికే ఆ భగవంతుడు ప్రసాదించాడు.

## హంద్రీ-నీవా రైతులను
## మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం!

- కెవి రమణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేలుకుబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 12:** 3850 కోట్లు ఖర్చు చేసి హంద్రీ-నీవా విస్తరణ,లైనింగ్ పనులు పూర్తి చేసాం,6.25లక్షల ఎకరాలకు సాగునీరు,30 లక్షల మంది జనాభాకు తాగునీరు కేవలం 100 రోజుల్లో పూర్తి చేసి సూపర్ హిట్ కొట్టేశాం అని గొప్పలు చెబుతున్నప్పటికీ,హంద్రీ-నీవామొదటి దశ కింద ఉన్న ఆర్థిక శాఖా మాత్యులు పయ్యావుల కేశవ్ గారి నియోజకవర్గం ఉరవకొండ పరిధిలో 80 వేల ఎకరాలకు నీరు ఇవ్వాల్సి వుండగా,విస్తరణ పూర్తి అయిన తరువాత కూడా ఒక్క ఎకరాకు కూడా నేరుగా నీరు అందలేదు.

ఈ నేపథ్యంలో హంద్రీ-నీవా మొదటి దశలో అంతర్భాగమైన జీడిపల్లి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో పలు గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తే అక్కడి రైతులు మా కళ్ళముందు నీళ్లు వెళుతున్న ఒక్క చుక్క నీరు కూడా ఉపయోగించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని,ఈసారి ఖరీఫ్ పూర్తిగా నష్ట పోయిన సందర్భంగా,కనీసం రబీలోనైనా హంద్రీ-నీవా నీటితో పంటలు పండించుకుందామనుకుంటే పిల్ల కాలవలు ఏర్పాటు చేయని కారణంగా ఏమాత్రం హంద్రీ-నీవా ఉపయోగపడడం లేదని,ఈ విస్తరణ పనులు కేవలం కాంట్రాక్టర్ల కోసమేనని గోడు వెల్లబోసుకున్నారు. మొదటి దశలో గల జీడిపల్లి రిజర్వాయర్ పరిధిలోని ఉరవకొండ, రాప్తాడు,అనంతపురం,నియోజకవర్గాలలో గల ఆయకట్టుకే చుక్క నీరు ఇవ్వలేని ప్రభుత్వం,ఆగ మేఘాల మీద లైనింగ్ చేసి కుప్పం కు నీళ్లు తీసుకుపోవడం ఎందుకు? ఒకవేళ చెరువులు నింపడానికి అనుకుంటే ఒక చెరువు పూర్తిగా నిండాలంటే కనీసం 10 రోజులు పడుతుంది,అలా హంద్రీ-నీవాకు అనుసంధానంగా ఉన్న 30 చెరువులు పూర్తిగా నిండాలంటే 300 రోజులు పడుతుంది.దీనిని బట్టి ఈ విస్తరణ పనులు రైతుల కోసం కాదు,కాంట్రాక్టర్ల కోసమే అని అర్థమైపోతుంది.

## దౌర్జన్యంగా కోట్ల విలువ చేసే భూములు కాజయాలని
## చూస్తే ఊరుకోం వాల్మీకి సేవాదళ్ బుల్లెట్ లింగమయ్య



**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 12:** వాల్మీకి సేవాదళ్ పార్లమెంట్ అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాడిపత్రి కుల్లాయమ్మకు చెందిన భూమి అనంతపురం జిల్లా గుత్తి అనంతపురం హైవే రోడ్డు లో సర్వే నెంబర్ 164%ఎ,165ఎ% లోఉన్న 2 ఎకరాల 80 సెంట్లు భూమిని మాసినేని రామయ్య, తమ్ముని కొడుకు అమరేంద్ర వారు దౌర్జన్యంగా ఆన్లైన్లో గత ప్రభుత్వంలో ఎక్కించుకోవడం జరిగిందని, ఆ భూమి రిజిస్టర్ ఒకరి పేరు మీద ఉంటే మరొకరు ఏ విధంగా ఆన్లైన్ చేయించుకుంటారని ప్రశ్నించారు. పేద ప్రజల వాల్మీకి భూములను బడా,బాబులు ఆర్థిక బలంతో ఆన్లైన్ చేయించుకోవడం సరైనది కాదని సూటిగా హెచ్చరించారు. ఒక్కొక్కసారి ఒక్కో విధంగా డబ్బులు ఇస్తామని చెప్పి, ఆన్లైన్ ఎక్కించుకోవడం తప్పయింది, చెప్పి కూడా దానిని పట్టించుకోకుండా మరోసారి అడిగితే, ఈ భూమి వారిని కొల్లాయమ్మ వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ మీకు ఇష్టం వచ్చిన వారితో చెప్పుకోండి అని చెప్పడంపై తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పలుకు బడులను ఉపయోగించి పేద ప్రజల భూములను ఆన్లైన్ చేయించుకోవడంపై విమర్శించారు. దీనిపై కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మార్వో, అధికారులందరూ స్పందించి పేద ప్రజల భూములకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. మాసినేని రామయ్య, తన సోదరుడి కుమారుడు అమరేంద్ర కేవలం కోర్టుల పేరుతో, కోర్టులో కూడా వీరికే న్యాయం జరిగిన కూడా ఏ బలం లేకపోయినా అధికారులకు లంచాలతో మేనేజ్ చేయించి కోట్ల విలువ చేసే భూములను కాజేయాలని దురుద్దేశం చేస్తున్నారని ఆరోపించారు. వీరికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకులను ఏకం చేసి న్యాయం జరిగేంత వరకు పోరాటం సాగిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో వాల్మీకి సేవాదళ్ చిన్న, వాల్మీకి సేవాదళ్ భార్గవ, వాల్మీకి సేవాదళ్ నారాయణస్వామి, వాల్మీకి సేవాదళ్ చంద్ర, భార్గవి లక్ష్మీదేవి రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో అత్యంత ఆధునిక టెక్నాలజీ తో సత్యసాయిబాబా 100వ వేడుకలు

- సత్యసాయి ట్రస్ట్ సహకారంతో రూ.1కోటి 32 లక్షలతో పుట్టపర్తి లో 91 ప్రాంతాల్లో 216 నిఘా కెమెరాలు ,నైట్ డ్రోన్ కెమెరాలు
- నిఘా నేత్రాలతో పుట్టపర్తికీ పూర్తి రక్షణ
- భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ జె రత్నాకర్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి : అక్టోబర్12:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతి ఉత్సవాలకు సత్యసాయి ట్రస్ట్ సహకారంతో రూ.1కోటి 32లక్షలతో దేశంలోనే పుట్టపర్తిలో అత్యాధునిక సాంకేతిక పరికరాలతో ప్రజలకు రక్షణ కల్పించే ఏర్పాట్లు చేయడం ఎంతో అభినందినీయమనీ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి కొనియాడారు. పుట్టపర్తి మున్సిపాలిటీలోని గణేష్ సర్కిల్ లో సత్యసాయి ట్రస్ట్ సహకారంతో గుర్తించిన 91 ప్రాంతాల్లో రూ.1కోటి 32 లక్షలతో నిఘా కెమెరాలు ఏర్పాటుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ జె రత్నాకర్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100 వ జయంతి ఉత్సవాలను ప్రజలు పోలీసుల సహకారంతో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సత్య సాయి ట్రస్ట్ సభ్యులు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రజల రక్షణ కోసం పోలీసులకు అందజేయడం ఎంతో అభినందించేదగ్గ విషయమని సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఆర్ జె రత్నాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ మాసంలో జరిగే బాబా వేడుకలకు పుట్టపర్తి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే విధంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాబా వేడుకలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ తో పాటు ప్రపంచ దేశాల నుంచి గవర్నర్లు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ ప్రముఖులు ఇక్కడికి సుమారు పది లక్షల మందిపైగా భక్తులు ఇచ్చేస్తారని తెలిపారు. అందుకు అనుగుణంగా పుట్టపర్తిలో ప్రజలకు మౌలిక వసతులతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అత్యాధునిక సాంకేతిక పరికరాలు ప్రత్యేకంగా వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసి అను నిత్యం పోలీసులు అపమత్తంగా ఉండేలా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బాబా 100 వ జయంతోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామని అందుకు ప్రతిఒక్కరు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు . మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో 100వ జయంతి ఉత్సవాలను సత్యసాయి ట్రస్ట్ సహకారంతో కూటమి ప్రభుత్వం లో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి పుట్టపర్తి కి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని గుర్తు చేశారు. భక్తులకు పుట్టపర్తిలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రస్ట్ సహకారంతో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచన మేరకు ప్రభుత్వ అధికారులు మౌలిక వసతుల కల్పనకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. బాబా వేడుకల సందర్భంగా పోలీసు యంత్రాంగానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ జె రత్నాకర్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, పుట్టపర్తి లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు ,నైట్ నిఘా డ్రోన్లు దేశంలో ఎక్కడ లేవని పేర్కొన్నారు. నవంబర్ మాసంలో జరిగే సత్యసాయిబాబా 100వ జయంతోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎంతో పకడ్బందీగా భక్తుల రక్షణ కోసం పోలీస్ భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగానికి అన్ని విధాలుగా సత్యసాయి ట్రస్ట్ సహకారం ఉంటుందని ట్రస్ట్ కార్యదర్శి రత్నాకర్ తెలిపారు. అనంతరం పుట్టపర్తి చిత్రవతి రోడ్ లో కోటి 20 లక్షలతో నిర్మాణం చేపట్టిన కూడా చిల్డ్రన్స్ పార్కును, స్నానపు ఘాట్స్ నిర్మాణ పనులను మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ డిఎస్పి విజయ్ కుమార్ కూటమి పార్టీల స్థానిక నాయకులు బోయ రామాంజనేయులు సాముకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో బిసిలను గెలిపించుకుందాం :సాకేనరేష్




అంకుశం ప్రతినిధిగుంటూరు :12 అక్టోబర్ :బిసి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం గుంటూరులో జరిగింది, ఈ సందర్భంగా న్యాయవాది, బిసి న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకేనరేష్ మాట్లాడుతూ రానున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో అత్యధికంగా బీసీలను మెంబర్లుగా గెలిపించుకోవాలని కోరుతూ అనంతరం సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది త్వరలో రాష్ట్రం లోని అన్ని బార్ అసోసియేషన్లను పర్యటిస్తామన్నారు.

## సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం.

–డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.



**పోరుమామిళ్ళ, అక్టోబర్ 12(అంకుశం పత్రిక)** :సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు పదే పదే చెప్పడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్ళలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైన హామీలు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. ప్రతినెల నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు ఇస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పడం జరిగిందని,అధికారం వచ్చి 16 నెలలు దాటినప్పటికీ నిరుద్యోగ యువతకు మూడు రూపాయలు కూడా ఇవ్వలేదు అన్నారు. ఈ16 నెలల్లో ఒక్కొక్కరికి 48 వేల రూపాయలు కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. ఈ విధంగా నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. 19–59 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పబడింది, వాళ్ళను కూడా మోసం చేశారు అన్నారు. రాష్ట్రంలో ఒక్క కోటి 80 లక్షల మంది ఈ వయసులో ఉన్న ఆడబిడ్డలు ఉన్నారు. ఈ 16నెలల్లో ఒక్కొక్క ఆడబిడ్డకు 24,000 రూపాయలు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టింది అన్నారు. ఈ విధంగా ఆడబిడ్డలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని తులసిరెడ్డి ధ్వజమెత్తారు.
ఎస్సీ ,ఎస్టీ ,బిసి ,ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పబడింది. ఇప్పటివరకు అతిగతి లేదు అన్నారు. రాష్ట్రంలో 17 లక్షల మంది అర్హులు ఉన్నారు. ఈ 16 నెలల్లో ఒక్కొక్కరికి 64వేల రూపాయలు చొప్పున చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టింది .ఈ విధంగా ఎస్సి ,ఎస్టి ,బీసీ ,ముస్లిం మైనారిటీలను నమ్మించి మోసగించింది కూటమి ప్రభుత్వమని తులసి రెడ్డి అన్నారు. ఇప్పటికైనా వట్టి మాటలు కట్టిపెట్టి వచ్చే నవంబర్ ఒకటో తారీకు నుంచి ప్రధానమైన ఈ మూడు హామీలను అమలు చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో పిసిసి సభ్యులు , పోరుమామిళ్ల మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ముజాహిద్, సలావుద్దీన్, రఫీ, ఇలియాస్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఎమ్.జె.పి. గురుకుల పాఠశాలలు ఏర్పాటు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత





**అంకుశం ప్రతినిధి తూర్పు గోదావరి : అక్టోబర్ 12:** తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి శ్రీమతి ఎస్. సవిత ఆదివారం కొవ్వూరు నియోజకవర్గంలో శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు తో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పర్యటన నేపథ్యంలోచాగల్లు మరియు తాళ్లపూడి మండలాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) కింద రూ.4,50,500 విలువైన చెక్కులను మంత్రి చేతుల మీదుగా కొవ్వూరు లో అందజేశారు. అనంతరం మంత్రి సవిత వాడపల్లి గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహం మరియు మహాత్మా జ్యోతిరావు పూలే (ఎమ్.జె.పి.) గురుకుల పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ "ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఎమ్.జె.పి. గురుకుల పాఠశాలలు స్థాపన జరుగుతోందని పేర్కొన్నారు.వాడపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. "మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతోందా? మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా?" అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కావడంతో గురుకుల పాఠశాల వద్దకు వొచ్చిన విద్యార్థుల తల్లులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది . ప్రభుత్వం ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, మరింత మెరుగ్గా పౌర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

స్త్రీ శక్తి మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రయోజనం పొందుతున్నామంటూ మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత కు ఆరోగ్య సంరక్షణ కు పెద్ద పీట వేసే క్రమంలో "ప్రతి వసతి గృహం, పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సవిత తెలియ చేశారు. విద్యార్థులకు ప్రతి వారం వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడేందుకు కాయిన్ బాక్స్ ఫోన్ సౌకర్యం కల్పించాం" అని తెలిపారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న ఈ గురుకుల పాఠశాలకు త్వరలో స్వంత భవనం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల అంచనా లకు అనుగుణంగా సంక్షేమం మరియు అభివృద్ధి పథకాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సమయానుకూల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీవో రాణి సుస్మిత, బీసీ సంక్షేమ అధికారి బి. శశాంక, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో13న కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, అక్టోబరు 12:** శ్రీ సత్య సాయి జిల్లాలోని పుట్టపర్తి పట్టణం నందులిఈ నెల 13న సోమవారం ఉదయం శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. కలెక్టరేట్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చంద్రగిరిలోని శ్రీ కోదండరామాలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



**అంకుశం న్యూస్ తిరుపతి అక్టోబర్ 12:** చంద్రగిరిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మొదటిరోజు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు చతుష్టార్చన, పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పవిత్ర హోమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ



సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ముని హరిబాబు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలనందించాలి.. ఆర్డీవో ఏ.మహేష్.



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 12:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలను తప్పక అందించాలని ఆర్డీవో ఏ. మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య సేవలు, పరిశుభ్రత పరిస్థితులు, ఔషధాల లభ్యత, సిబ్బంది హాజరు వంటి అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. తదుపరి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందుతున్న రోగులతో వారు వ్యక్తిగతంగా మాట్లాడి వారికి అందిస్తున్న సదుపాయాలు గూర్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఆసుపత్రి సిబ్బందికి రోగుల పట్ల పూర్తిగా శ్రద్ధ, దయ, సేవా భావంతో కూడిన విధులు, బాధ్యతతో వైద్యులతో పాటు సిబ్బంది తప్పక మెలగాలని వారు తెలిపారు. అంతేకాకుండా తప్పనిసరిగా ఆసుపత్రి యొక్క పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిమీద ఉందని, పర్యవేక్షించాల్సిన అవసరం కూడా ఎంతో ఉందని తెలిపారు. ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ నేతృత్వంలో తప్పక ప్రభుత్వ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా వైద్యులు సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, సీరియస్ గా ఉన్న రోగుల పట్ల వైద్య చికిత్సలను అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అవకాశాన్ని బట్టి మరింత సమయాన్ని ఇచ్చి రోగులకు సేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే పరిపాలన యొక్క ప్రధాన లక్ష్యము అని వారు స్పష్టం చేశారు. తదుపరి ఆసుపత్రిలోని సమస్యలను వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, హెడ్ నర్సులు, సిస్టర్లు పాల్గొన్నారు.